క్లుప్తంగా

వితరణ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గాంధీ పార్కు వద్ద నిరుపేద వృద్ధులకు స్థానిక బలిజ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మానవత దృక్పథంతో 400 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బలిజ సంఘ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆకుల కుబేరు మణి, పగడాల శివ ప్రదీప్, మదిరి చిట్టిబాబు ఏవీ కుమార్, కొరివి లక్ష్మీ, నారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 57.140 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 57.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. కండలేరు నుంచి సత్య సాయి గంగకాలువకు 1030, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి



సీఐలు, ఎస్‌ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ వీవీ రమణకుమార్

చిల్లకూరు: డివిజన్‌లో కొత్త ఏడాదిలో నేరాల సంఖ్యను పూర్తిగా తగ్గించేందుకు ఆయా స్టేషన్ల పరిధిలో ఎస్‌ఐలు, సీఐలు కృషి చేయాలని గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ సూచించారు. గూడూరు డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా గూడూరులోని సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల సంఖ్యను తగ్గించేందుకు నిఘా పెంచాలని సూచించారు. మండలాల అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని అన్నారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ : ఈనెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లి వద్ద జరగనున్న హైందవ శంఖారావంలో హిందువులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. బుధవారం నీర్పాకోటలోని ఆంజనేయస్వామి ఆలయంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీ సాయంత్రం బుచ్చినాయుడుకండ్రిగ నుంచి బస్సు హైందవ శంఖారావం సభకు బయలుదేరుతుందని చెప్పారు.

పక్షుల కేంద్రం..
వసతులు శూన్యం



నత్తగుల్లకొంగల పిల్లలు


- నేలపట్టు పక్షుల కేంద్రంలో మౌలిక సదుపాయాలు కరువు
- ఆర్‌ఓ ప్లాంటు ఉన్నా తాగేందుకు గుక్కెడు నీరు లేదు
- వ్యూ పాయింట్ల వద్ద పక్షుల వివరాలు చెప్పేందుకు సిబ్బంది ఉండరు
- టికెట్ కౌంటర్ నుంచి పక్షుల వీక్షించే వరకు సందర్శకులకు అన్నీ ఆటంకాలే !
- బైన్యాక్యులర్స్ ఇవ్వని వైనం
- పట్టించుకోని వన్యప్రాణి విభాగం అధికారులు

ఆసియా ఖండంలోనే విదేశీ శీతాకాలపు వసల విహంగాలకు అతిపెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి గుర్తింపు. ఇక్కడ విడిది చేసేందుకు వచ్చే విహంగాలను వీక్షించేందుకు సందర్శకులు, పక్షి ప్రేమికులు వారాంతపు, పండుగ దినాల్లో అధిక సంఖ్యలో వస్తారు. అయితే ఇక్కడ సందర్శకులకు కనీస సదుపాయాలు కల్పించడంలో వన్యప్రాణి విభాగం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విహంగాల వీక్షణకు వచ్చిన వారికి కనీసం తాగునీరు ఉండడం లేదు. పక్షుల గురించి సందర్శకులకు చెప్పేవారు కరువయ్యారు.

దొరవారిసత్రం: ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వసతులు కరువయ్యాయి. తాజాగా కొత్త సంవత్సరం కావడంతో బుధవారం ఏపీ నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ నుంచి సందర్శకులు భారీగా వచ్చారు. అయితే పక్షుల కేంద్రం ప్రధాన గేట్లు వద్ద ఉన్న టికెట్ కౌంటర్ నుంచి పక్షులను వీక్షించే వరకు పలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా టికెట్ కౌంటర్ వద్ద, పక్షుల కేంద్రం మార్గం మధ్యలో ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో బయట ప్రాంతాల నుంచి వాహనాల్లో విచ్చేసిన పర్యాటకులకు ఇబ్బందులు తప్పలేదు.

సందడిగా కేంద్రం..

పక్షుల కేంద్రంలోని గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలు, నీటికాకులు, స్వాతికొంగలు తదితర వంటివి అన్ని పిల్లలను పొదిగి ఉన్నాయి. వీటిని వీక్షించేందుకు నెల్లూరు, తిరుపతి, గూడూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు వచ్చారు. చిన్నపిల్లలు పర్యావరణ కేంద్రం వద్ద ఉన్న పార్కులో ఆడుకున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది కుటుంబ సభ్యులతో నూతన సంవత్సరం వేడుకలను జరుపుకున్నారు.



విడిది చేసే విహంగాల వ్యూపాయింట్

సౌకర్యాలు కరువు...

పక్షుల కేంద్రంలో వేల సంఖ్యలో విడిది చేసే విహంగాలను వీక్షించేందుకు సందర్శకులు వస్తుంటారు. కాని వారికి అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలను కల్పించడంలో స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. ఇప్పుడు వస్తున్న ఈ కొద్దిపాటి సందర్శకులకే వసంతులు కల్పించలేకపోతే.. త్వరలో జరిగే పక్షుల పండుగ సమయంలో వేల సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. మరి అప్పుడు ఏమాత్రం ఏర్పాట్లు చేస్తారో అంతుపట్టడం లేదని పలువురు అంటున్నారు. పక్షుల కేంద్రంలో ప్యూరిఫై వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ కేంద్రంలో తాగునీటి వసతి ఎందుకు కల్పించలేదని సందర్శకులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలో వ్యూ పాయింట్లు వద్ద సందర్శకుల పక్షుల వివరాలు తెలిపేందుకు సిబ్బంది లేరు. కనీసం పక్షులను వీక్షించేందుకు బైనాక్యులర్స్ కూడా అందుబాటులో లేవు. కేంద్రంలోకి వచ్చేవారి నుంచి ప్రవేశ రుసుం, వాహనాలకు రుసుం వసూళ్లు చేస్తున్నారే కాని సందర్శకుల అవసవరమైన వసతులు కల్పించడం లేదు. పార్కింగ్ సక్రమంగా లేకపోవడంతో రోడ్డు మీదే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి వస్తోంది.

గుక్కెడు నీళ్లు లేవు..



పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 ఎంట్రీఫీజు.. అలాగే బైక్‌కు రూ.50, అదే ఆటో, కారు అయితే వందల రూపాయలు ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారు. పక్షుల కేంద్రాన్ని సందర్శించే సందర్శలకు కనీసం తాగునీటి వసతి కల్పించకపోవడం చాలా బాధాకరంగా ఉంది. కేంద్రంలో ఎక్కడా తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదు.

– ఎం.మునస్వామి, సందర్శకుడు, చెన్నై

వసతులు కరువు



నేలపట్టు పక్షుల కేంద్రంలో సందర్శకులకు అవసరమైన వసతులు ఏమీ లేవు. సరైన సదుపాయాలు, ఏర్పాట్లు కాని చేయడం లేదు. ఓవైపు ప్రవేశ రుసుంతో వచ్చే ఆదాయం.. మరోవైపు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులు ఏమవుతున్నాయో ? కనీస వసతులు కల్పించాలి.

– నాగరాజు, నెల్లూరు పట్టణం



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

పక్షుల విన్యాసాలు.. సందర్శకుల కేరింతలు

పక్షుల కేంద్రంలోని చెట్లపై విడిది చేసే విహంగాల విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అవి చేసే విన్యాసాలు చూపర్లను అబ్బురపరిచాయి. గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయి పక్షుల విన్యాసాలు, వాటి చేష్టలు చిన్నారులను ఆనందపరిచాయి. పెద్ద విహంగాలు పిల్లలకు మేత పెట్టే సన్నివేశాలు పర్యాటకులను ఇట్టే కట్టిపడేశాయి.







పిల్లలను పొదిగిన గూడబాతులు, విహంగాలను వీక్షించేందుకు విచ్చేస్తున్న సందర్శకులు

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్



నాయుడుపేటలో వైఎస్సార్ సర్కిల్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న సీఐ బాబీ



నాయుడపేట డీఎస్పీ చెంచుబాబును సత్కరిస్తున్న వ్యాపార సంఘాల వారు

నాయుడుపేటటౌన్: నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి గొడవలు, ఘర్షలకు చోటు చేసుకోకుండా పోలీసులు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సారథ్యంలో అర్బన్, రూరల్ స్టేషన్ల సీఐలు బాబి, సంగమేశ్వరావు, ఎస్‌ఐలు ఆదిలక్ష్మీ, స్వప్న, నాగరాజు, అజయ్‌కుమార్ పలు కూడళ్ల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు సీఐ బాబి తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు డీఎస్పీ చెంచుబాబుకు, పోలీసులకు నూతన సంవత్సర శుభాకాంక్షాలు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

కోట: స్థానిక నార్త్ గిరిజన కాలనీలో బుధవారం విజయశంకర్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కోటకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సారంగం విజయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబసభ్యులు పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రమేష్‌బాబు, విజయభాస్కర్, సుధీర్, వాసు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు



మంచులో ఇబ్బంది పడుతున్న జనం

మంచుకురిసే వేళ.. జనం ఇలా..

సైదాపురం: మండలంలో విపరీతమైన మంచు కురుస్తుండడంతో రైతులు, ప్రజలు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8 గంటలు, 9 గంటలైనా దట్టమైన పొగమంచు పడుతుండడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడం లేదు. వాహనదారులు ఉదయం పూట మంచు అధికంగా ఉండడంతో వెలుతురు కోసం లైట్లు వేసుకుని వెళ్తున్నారు.

కొత్త ఏడాదిలో శుభాలు కలగాలని..





ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ, భువనేశ్వరుడు









లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో చెల్లాతమ్మ, దుర్గాదేవి, పెంచలకోనలో శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భక్తజనం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- చెంగాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- భక్తజనసంద్రమైన పెంచలకోన

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులు పోటెత్తారు. పెనుశిల లక్ష్మీ నరసంహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 10.30 గంటలకు అలంకార మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవవిగ్రహాలను పుష్పాలు, ఆభరణాలతో శోభయమానంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ దేవదేవేరుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందించారు.

కిక్కిరిసిన ఆలయాలు..

రాపూరు మహావిష్ణువు, అయ్యప్పస్వామి, వినాయక, శివాలయం, కన్యకా పరమేశ్వరి, షిర్డీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు.



అమ్మవారికి సమర్పించిన ముత్యాల చీర

ముత్యాల చీర బహూకరణ..

మండలంలోని వేపినాపి సమీపంలో ఉన్న అంకాళ పరమేశ్వరిదేవికి పాపకన్ను ప్రభాకర్‌రెడ్డి, ఉమ దంపతులు ముత్యాల చీర సమర్పించినట్లు ఆలయ అధ్యక్షుడు పాపకన్ను వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

తడలో ..

తడ: శ్రీసిటీ, మాంబట్టు ఏపీఐఐసీ సెజ్‌లతోపాటు ఇతర పరిశ్రమలకు కేంద్ర బిందువుగా ఉన్న తడలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కేకు కటింగ్‌లు, వేడుకలు అంబరాన్నంటాయి. అదేవిధంగా ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలవ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. సైదాపురం సమీపంలోని శ్రీసిద్ధలయ్య కోనలో, సాయిబాబా, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ప్రార్థించారు. వైకుంఠపురంలో వెలసిన మహావిష్ణువు ఆలయంలో పూజలు చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణ, రూరల్, చిల్లకూరు మండలాల్లోని పలు ప్రార్థనాలయాలు కిటకిటలాడాయి. ఆలయాలు, చర్చిలు, మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చెంగాళమ్మకు స్వర్ణాభరిత శోభ

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. ఆలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. అమ్మవారు స్వర్ణాభరణ దివ్య శోభిత అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీ ఇంట సంబరాలు

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి అధికారులు, పోలీసులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయుడుపేట, సూళ్లూరుపేట పురపాలక సంఘాల కమిషనర్లు, సీఐలు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛాలు అందించారు. అలాగే సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సూచనల మేరకు వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇవ్వడానికి దుప్పట్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు అందించారు.



ఎమ్మెల్యే విజయశ్రీని గజమాలతో సత్కరిస్తున్న పోలీసులు



ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ ఆలయం



పూజలు చేస్తున్న అర్చకులు



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు









తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికకు, హరనాథ్‌రెడ్డికి, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

న్యూఇయర్ కోలాహలం

నాయుడుపేటటౌన్: నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ బుధవారం పట్టణంలోని పలు పార్టీల నాయకుల నివాసాలకు కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పుదూరు గ్రామంలో ఎంపీపీ ధనలక్ష్మికి నాయకులు, కార్యకర్తలు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఓజిలి: మండలవ్యాప్తంగా న్యూఇయర్ సంబరాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డిని పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణారెడ్డిని పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కామిరెడ్డి ఇంట సంబరాలు

పెళ్లకూరు: మండలవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి చిల్లకూరులోని ఆయన నివాసం వద్ద ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, అభిమానులు శాలువాలు, పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్‌అండ్‌బీ సారూ.. దారేదీ గురూ..!



సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ కార్యాలయం గేటు వద్ద చెత్తాచెదారం

సూళ్లూరుపేట: ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి వెళ్లేదారిలో చెత్తాచెదారం ఉంది. దీంతో కార్యాలయానికి వెళ్లిన వారు లోపలకు ఎలా వెళ్లాలని అక్కడ ఉన్నవారిని అడగాలి. జెడ్పీ హైస్కూల్‌ను అనుకుని, జీఎన్‌టీ రోడ్డు ఫేసింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం పాతబడింది. పైగా కార్యాలయం ముందు వర్షపు నీరు నిల్వ ఉంది. డ్రైనేజీ నిండిపోయింది. చెత్తాచెదారం అంతా కార్యాలయం గేటు ముందే డంప్ చేశారు. ఆ శాఖ అధికారులు కార్యాలయానికి ఎలా వస్తారో తెలియని పరిస్థితి. సూళ్లూరుపేట రోడ్డును బాగు చేయలేని వారు కార్యాలయాన్ని ఏంబాగు చేస్తారులే అని అక్కడికి పనుల నిమిత్తం వచ్చే వారు చర్చించుకోవడం విశేషం.

నూతన కమిటీ ఏర్పాటు



ఎన్నికైన కమిటీ సభ్యులు

వాకాడు: మండల కేంద్రమైన వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి నూతన కమిటీని బుధవారం సంఘ కాపరి ఎస్.ప్రశాంత్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అందులో కమిటీ చైర్మన్‌గా డాక్టర్ డేనియల్ చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా జాలాది కిషోర్, సెక్రటరీగా రాజ్‌కుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ సాటూరు సాల్మన్ చంద్రశేఖర్‌బాబు, సభ్యులుగా అబ్రహం, రాజీవ్, గాయం భాస్కర్‌ను ఎంపిక చేసినట్లు సంఘకాపరి తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.